క్లుప్తంగా

పోషకాహారంతోనే తల్లీబిడ్డ క్షేమం



వల్లూరు(కాకుమాను): గర్భిణి సమయంలో పోషకాహారం తీసుకుంటేనే తల్లీబిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ పాంగ్రపాడు సెక్టార్ సూపర్ వైజర్ పోసమ్మ కుమారి అన్నారు. మండలంలోని వల్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పోసమ్మ కుమారి మాట్లాడుతూ గర్భిణి సమయంలో, శిశువుకి జన్మనిచ్చిన తరువాత మహిళలు మంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని అప్పుడే తల్లీబిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ముఖ్యంగా రక్త హీనత లోపించ కుండా ఐరన్ అధికశాతం ఉన్న ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా ఐరన్ పదార్థాలు ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలను ఎలా తయారు చేసుకోవాలో వివరించారు.

పంట పొలాల్లో నీటిని బయటకు పంపించాలి

పెదకాకాని: వరదల కారణంగా పంట పొలాలకు చేరిన నీటిని రైతులు వీలైనంత త్వరగా బయటకు పంపించుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎం.సునీల్‌కుమార్ అన్నారు. పెదకాకాని మండలంలోని వరి పైరు నీట మునిగిన వెంకటకృష్ణాపురం, ఉప్పలపాడు, గోళ్లమూడి, నంబూరు గ్రామాల్లో పైర్లను సోమవారం పరిశీలించారు. వెనిగండ్లలో పత్తి పైర్లను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వరి పంట దుబ్బు చేసే దశలో ఉన్నందున నీరు బయటకు పంపించి ఎకరానికి 30 కిలోలు యూరియా 15 కిలోలు పొటాష్ ఎరువులపై పాటుగా వేసుకోవాలన్నారు. వరిలో పాము పొడ తెగుళ్ల ఉధృతి పెరిగే అవకాశం ఉండటంతో హెక్సాకొనజోల్, వాలిడామైసిన్, హెక్సాకొనజోల్ వంటి మురుగు మందులు తగిన మోతాదులో పిచికారి చేయాలన్నారు. అలానే ప్రత్తి పంటలో 30 కిలోలు యూరియా 15 కిలోలు ఎంఓపీని పై పాటుగా వేసుకోవాలన్నారు. పొటాషియం సల్ఫేట్, మెగ్నీషియం తగిన మోతాదులో పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి, ఏఈఓ రెడ్డి శివాజీ ఉన్నారు.

బుద్ధిజం విద్యార్థి మృతి దురదృష్టకరం

ఏఎన్‌యూ: దుగ్గిరాల పరిసరాల్లో పాముకాటుకు గురై ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బుద్ధిజం విద్యార్థి కొండన్న మృతి చెందటం దురదృష్టకరమని వీసీ ఆచార్య కె.గంగాధర రావు అన్నారు. పుట్టగొడుగులు కోసం వెళ్లి దుగ్గిరాల సమీపంలో శనివారం రాత్రి పాముకాటుకు గురై మృతి చెందిన ఎంఏ బుద్ధిస్ట్ స్టడీస్ విద్యార్థి సంతాప సభ సోమవారం నిర్వహించారు. తొలుత కొండన్న చిత్రపటానికి నివాళులర్పించారు. రెక్టార్ కె.రత్నాషీలామణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ స్వరూపరాణి, ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ డైరెక్టర్ పి.పద్మావతి, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ దివ్యతేజోమూర్తి, బుద్ధిజం విభాగాధిపతి ఉదయకుమార్ పాల్గొన్నారు.

కేసు నమోదు..

విద్యార్థి కొండన్న పుట్టగొడుగుల కోసం దుగ్గిరాల మండలం చిలువూరు సమీపంలో వెతుకుతుండగా పాముకాటుకు గురయ్యాడు. దీంతో రిజిస్ట్రార్ సింహాచలం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్ట్ మార్టరం నిర్వహించేందుకు మయన్మార్ దేశం నుంచి పోలీస్ శాఖకు సోమవారం అనుమతి వచ్చింది. దీంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. మృతదేహం అంత్యక్రియలు ఎక్కడ నిర్వహించాలనే దానిపై తల్లిదండ్రుల నిర్ణయం కోసం వేచిచూస్తున్నారు.

కళ్లకు నల్లరిబ్బన్‌లు కట్టుకుని స్టాఫ్‌నర్సుల నిరసన

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు సోమవారం సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద కళ్లకు నల్లరిబ్బన్ కట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రభుత్వం తమగోడు పట్టించుకోవడం లేదని, 15 ఏళ్లుగా రెగ్యులర్ స్టాఫ్‌నర్సుల పోస్టుల నోటిఫికేషన్ లేకపోవడంతో అవస్థలు పడుతున్నామంటూ బాధలు తెలిపేలా కళ్లకు గంతలు కట్టుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 4న విడుదల చేసిన జీఓ నంబరు 115ను వెనక్కు తీసుకోవాలని, కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులు చేతబట్టుకుని నినాదాలు చేశారు. తమ డిమాండ్‌లు నెరవేరే వరకు నిరసన కార్యక్రమం కొనసాగుతోందని, త్వరలోనే అత్యవసర వైద్య సేవలు మినహా ఇతర వైద్య సేవలు బంద్ చేస్తామని ఆంధ్రప్రదేశ్ నర్సుల పోరాట కమిటీ నేతలు తెలిపారు. వర్షంలో తడుస్తూ కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు నిరసన కొనసాగించారు. నిరసన కార్యక్రమంలో కమిటీ నేతలు స్వచ్ఛంద ప్రసాద్, పి.మనీష, బి.శివమ్మ, వి.విజయ్‌కుమార్, హైమావతి, కుసుమకుమారి, కరుణ తదితరులు పాల్గొన్నారు.

ఎంత కష్టం.. ఎంత నష్టం!

- పొన్నూరు నియోజకవర్గంలో 55 వేల ఎకరాల్లో వరి పంట సాగు
- సుమారు 30 వేల ఎకరాల్లో నష్టం అంచనా
- ఇంకా నీటిలోనే వేలాది ఎకరాలు
- పొలాల్లో వరద నీటి తొలగింపు చర్యలు శూన్యం
- సూచనలతో సరిపెడుతున్న వ్యవసాయాధికారులు



వెల్లలూరులో నీట మునిగి ఉన్న వరి పంట

మండలం	వరి సాగు (ఎకరాల్లో)	నష్టం ప్రాథమిక అంచనా
పొన్నూరు	25 వేలు	15 వేలు
పెదకాకాని	16 వేలు	6 వేలు
చేబ్రోలు	13,500	7,600

పొన్నూరు: వరద ప్రభావం చాలా ప్రాంతాల్లో తగ్గలేదు. పొన్నూరు నియోజకవర్గంలో వేలాది ఎకరాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. నీట మునిగిన పంట పొలాల్లో నీటిని వెంటనే తొలగించాలని ప్రభుత్వం చెబుతున్న మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయే కానీ ఆచరణలో సాధ్యం కావడం లేదు. తమకేం పట్టలేదన్నట్లుగా అధికార యంత్రాంగం వ్యవహరిస్తోంది. సకాలంలో డ్రెయిన్లలో గుర్రపు డెక్క, వ్యర్థాలు, పూడికతీత పనులను ప్రభుత్వం చేపట్టని కారణంగానే పంటలు ముంపునకు గురయ్యాయని రైతుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం నీట మునిగిన పంట పొలాల సందర్శనలతోనే కాలం గడుపుతున్నారని, ముంపు నుంచి పొలాలను కాపాడే దిశగా చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

దెబ్బతిన్న పొలాల అంచనా..

నియోజకవర్గంలో సుమారు 55 వేల ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా 30 వేల ఎకరాలకు పైగా వరి పంట మునిగినట్లు వ్యవసాయాధికారుల నివేదికలు చెబుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ వివిధ ప్రాంతాల్లో పర్యటించి డ్రెయిన్లలో పూడిక తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినా ఫలితం కనిపించడం లేదు.

ఏ ప్రాంతంలో..

భారీ వర్షం తగ్గుముఖం పట్టడంతో కొన్ని చోట్ల ఇప్పుడిప్పుడే పొలాలు ముంపు నుంచి బయట పడుతుంటే పలు ప్రాంతాల్లో ఇంకా నీటిలోనే ఉన్నాయి. ప్రధానంగా మునిపల్లె, మన్నవ, జూపూడి, దొప్పలపూడి, సీతారాంపురం, ఉప్పరపాలెం, వెల్లలూరు, కసుక్రు, గాయంవారిపాలెం, బ్రాహ్మణ కోడూరుతో పాటు పలు గ్రామాల్లో ఇంకా నీటిలోనే పొలాలు మునిగి ఉన్నాయి. ఇలా కొన్ని రోజులు ఉంటే మొక్కలు కుళ్లిపోతాయని రైతులు వాపోతున్నారు. ఇరిగేషన్ శాఖ నిర్లక్ష్యమే పంట పొలాల మునకకు కారణమైందని ఆరోపిస్తున్నారు. సకాలంలో డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతోనే ఈ స్థితికి కారణమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముంపు బారిన పడిన వరి పొలాలను సందర్శించిన వ్యవసాయాధికారులు ముంపు నుంచి పంటలను కాపాడే విధంగా చర్యలు చేపట్టం లేదని చెబుతున్నారు. పలు సూచనలతో కాలం వెళ్లదీస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పొలంలో నీరు వెళ్లాక చేయాల్సిన జాగ్రత్తలు తెలియచేస్తున్నారు కానీ, వరద నీరు వెళ్లే మార్గం చూపడం లేదని రైతులు వాపోతున్నారు. నష్టం వాటిల్లిన పంటలను వెంటనే గుర్తించి నష్ట పరిహారం అందించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలి



పొన్నూరులో 25 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా సుమారు 15 వేల ఎకరాలు పంట నష్టం, చేబ్రోలు మండలంలో 13,500 ఎకరాల్లో సాగు చేయగా 7,600 ఎకరాల్లో వరిపంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. పొలాల్లో నీరు బయటికి వెళ్లాక ఒక ఎకరానికి బూస్టర్ డోస్‌గా 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాషియం చల్లాలి. పొలాలకు సంబంధించి డ్రెయిన్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతోనే నీటి నిల్వకు కారణమైంది.

–రమా కోటేశ్వరి, ఏడీఏ, పొన్నూరు



నిడుబ్రోలు సమీపంలో నీట మునిగి ఉన్న పొలాలు



మునిగిన పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

విద్యార్థుల ప్రగతిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

ఎంఈఓ కెనడీ



పాంగ్రపాడు(కాకుమాను): విద్యార్థుల ప్రగతి ఆధారంగా విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంఈఓ కేఫ్ కెనడీ అన్నారు. మండలంలోని పాంగ్రపాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఎంఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎంఈఓ కెనడీ మాట్లాడుతూ తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రతిరోజు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారిని విద్యలో రాణించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన సూచించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా నిర్వహించి ప్రతి రోజు మెనూ ప్రకారం విద్యార్థులకు మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈఓ–2 విజయ్ భాస్కర్, హెచ్ఎం ఎం.నాగమల్లేశ్వరి ఉన్నారు.

సమస్యలపై కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేయండి

నగర కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూనగర్: ప్రజలు సమస్యలపై నగరపాలక సంస్థ 24 గంటలు అందుబాటులో ఉండే కాల్ సెంటర్‌కి ఫిర్యాదు చేయవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస, సహాయ చర్యల కోసం గుంటూరు నగరపాలక సంస్థ ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులు, కార్యదర్శులు, కార్మికులు అధిక సంఖ్యలో వెళ్లిన నేపథ్యంలో పారిశుద్ధ్యం, తాగు నీటి సరఫరాలో ఏ సమస్య ఉంటే ఫిర్యాదు చేయాలని కోరారు. వరదల దృష్ట్యా నగర పజలు కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. సమస్యను 0863–2345103, 104 నంబర్లకు కాల్ చేయడం లేదా 98499 08391 నంబర్ కి వాట్సప్ చేయవచ్చని పేర్కొన్నారు.

వరద బాధితులకు దాతలు సాయం



విజయవాడలో వరద బాధితులకు ఆహారం, సరకులు పంపిణీ చేస్తున్న విజ్ఞాన్ విద్యార్థులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన యూనివర్సిటీ ఆధ్వర్యంలో విజయవాడ నగరంలోని వరద ప్రభావిత కాలనీల్లో ఆహారం, బ్రెడ్, నిత్యావసరాలు పంపిణీ చేసినట్లు వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ సోమవారం తెలిపారు. 250 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రెండు గ్రూపులుగా విజయవాడ సిటీలోని చిన్ని నగర్, అజిత్ సింగ్ నగర్, వడ్డెర కాలనీ, పీస్టీ నగర్, వైఎస్సార్ కాలనీ, ఆంధ్రప్రభ కాలనీ, తోటవారి వీధి, సింగ్ నగర్ కాలనీలోని ప్రజలకు అందించారు. మరి కొంతమంది విద్యార్థులు తాడేపల్లిలోని పలు కాలనీలలో ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయ కార్యక్రమాల సర్వేలో పాల్గొన్నట్లు తెలిపారు. కష్ట సమయంలో వరద బాధితులకు ప్రజలందరూ బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు.

తుఫాన్ బాధితులకు సాయం

గుంటూరు రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లు మునిగి ఇబ్బందులు పడుతున్న బాధితులు చేతనైన సాయం చేయటం మనవ ధర్మమని స్వర్ణభారతీనగర్‌కు చెందిన కవనెంట్ చర్చి పాస్టర్ అరుమళ్ల జాన్‌తిమోతి తెలిపారు. సోమవారం నగర శివారుల్లోని కేవీపీ కాలనీలో భారీ వర్షాలకు ఇళ్లు నీటిలో మునిగిన కుటుంబాలకు ఆయన చీరలు, బట్టలు, బిస్కెట్స్, వాటర్‌బాటిల్స్ సరుకులను పంపిణీ చేశారు. వర్షాల వల్ల నష్టపోయిన కుటుంబాలకు ప్రతి ఒక్కరూ సాయం అందించాలని కోరారు.



కేవీపీ కాలనీలో దుస్తులు, సరుకులు అందిస్తున్న పాస్టర్ జాన్ తిమోతి తదితరులు



విజయవాడలో బాధితులకు పంపిణీ చేస్తున్న శ్రీభ్రమరాంబ చారిటబుల్ ట్రస్టు సభ్యులు

బాధితులకు అండగా శ్రీ భ్రమరాంబ చారిటబుల్ ట్రస్టు సేవలు

పెదకాకాని: వరద బాధితులకు శ్రీ భ్రమరాంబ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సేవలు అందిస్తున్నట్లు ట్రస్టు సభ్యుడు శీలం నాగార్జున తెలిపారు. విజయవాడలో వరదలకు ప్రభావంతో బుడమేరు వాగుకు గండి పడి ఇప్పటికీ పలు కాలనీల్లో బురద నీరు నిలిచే ఉందన్నారు. ఆ బాధితులకు పెదకాకాని మండలంలోని వెనిగండ్ల గ్రామానికి చెందిన దాతల సహకారంతో ట్రస్టు ఆధ్వర్యంలో మూడు రోజులుగా ఆహార పదార్థాలు, వాటర్ ప్యాకెట్లు అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, అడ్వకేట్ టి.వరకుమార్, ఎస్‌కే జహీర్, ఎస్‌కే రషీద్, చెన్నకేశవరెడ్డి, కోటేశ్వరరావు, షరీఫ్, కొండా సాంబిరెడ్డి, షేక్ గౌస్, అర్చకుడు శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ



పాతరెడ్డిపాలెంలో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

చేబ్రోలు: భారీ వర్షాల కారణంగా నష్టపోయిన కుటుంబాలకు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సోమవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. చేబ్రోలు మండలం పాతరెడ్డిపాలెంలో వర్షాల కారణంగా నష్టపోయిన 250 కుటుంబాలకు ప్రభుత్వం అందించిన నిత్యవసర సరుకులను అందజేశారు. 25 కిలోల బియ్యం, పంచదార కిలో, కందిపప్పు కిలో, పామాయిల్ కిలో, ఉల్లిపాయలు రెండు కిలోలు, బంగాళ దుంపలు రెండు కిలోల చొప్పున అందించారు. వర్షాల కారణంగా నష్టపోయి దెబ్బతిన్న కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు మైలా వెంకట రామరాజు, గట్టుపలి సుజిత్‌కుమార్, అనంత లక్ష్మీనారాయణ, ఇర్ఫాన్, రాజా, చంటి పాల్గొన్నారు.

బూత్ లెవల్ అధికారులకు పారితోషికం ఇవ్వాలి



తహసీల్దార్ వెంకటస్వామికి వినతిపత్రాన్ని అందజేస్తున్న బూత్ లెవల్ అధికారులు

కాకుమాను: గత సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొని బూత్ లెవల్ అధికారులకు వెంటనే ఎన్నికలకు సంబంధించిన పారితోషికం వెంటనే చెల్లించాలని తహసీల్దార్ వెంకటస్వామికి సోమవారం బీఎల్ఓలు వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఓటరు జాబితా మొదలుకుని ఎన్నికలు పూర్తయ్యే వరకు వెట్టి చాకిరి చేసిన బీఎల్ఓలకు ఇంతవరకు గౌరవ వేతనం చెల్లించకపోవడం అన్యాయమని వారు పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 46 వేల మందికి పైగా ఎన్నికల విధుల్లో పాల్గొన్నారని ఇప్పటికైన అధికారులు, సంఘ నాయకులు స్పందించి గౌరవ వేతనాలను వెంటనే విడుదల చేసే విధంగా కృషి చేయాలని వారు కోరారు. తహసీల్దార్ వెంకటస్వామి మాట్లాడుతూ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను త్వరితగతిన పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ ర్యాలీ



అక్షరాస్యత ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

గుంటూరు రూరల్: అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని నగర శివారుల్లోని లాం చలపతి ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో లాం గ్రామంలో ప్రధాన వీధుల్లో నిరక్షరాస్యతను తగ్గించి అక్షరాస్యతా శాతాన్ని పెంచే దిశగా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ప్లకార్డులతో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరికి చదువుకునే హక్కు ఉందని ప్రతి ఒక్కరూ చదవటం, రాయటం, సమాచార నిర్ణయాలు తీసుకునే నైపుణ్యాలు అందించటం ద్వారా జీవన నాణ్యత ప్రమాణాలు పెరుగుతాయని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామరావు మాట్లాడుతూ అక్షరాస్యత శాతాన్ని పెంచటం వల్ల పేదరికం తగ్గించి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ జి.నాగరాజు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మి

నెహ్రూ నగర్: ప్రజల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీలు రీ ఓపెన్ అయితే విభాగాధిపతే నేరుగా పరిశీలించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి సూచించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో నగర కమిషనర్ ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందే ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్ విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారీగా అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాల్సిందిగా కోరారు. సోమవారం ప్రజల నుంచి 23 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 5, ఇంజినీరింగ్ విభాగానికి 9, రెవెన్యూ విభాగానికి 2, ప్రజారోగ్య విభాగానికి 4, అకౌంట్స్ విభాగానికి 3 చొప్పున ఫిర్యాదులు వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ శ్యాం సుందర్, సిటీ ప్లానర్ రాంబాబు, ఎంహెచ్ఓ మధుసూదన్, మేనేజర్ ప్రసాద్, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుడికి జెడ్పీ చైర్‌పర్సన్ ప్రత్యేక పూజలు

గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడిని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, సురేష్‌కుమార్ దంపతులు సోమవారం దర్శించుకున్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గ్రామీణ నీటి సరఫరా విభాగ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో 7వ గణపతి నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొని అధికారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.



ప్రజలు నేత్రదానానికి ముందుకు రావాలి



అవగాహన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నెహ్రూ నగర్: ప్రజలంతా అపోహలు వీడి నేత్రదానానికి ముందుకు రావాలని గుంటూరు నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి దేవిరెడ్డి కిరణ్మయి అన్నారు. కేంద్ర ప్రభుత్వ నెహ్రూ యువకేంద్ర అనుబంధ సంస్థ జన చైతన్య సమితి ఆధ్వర్యంలో నేత్రదాన పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్మయి మాట్లాడుతూ నేత్రదానం, అంధత్వంపై అవగాహన నిర్వహించడంతో పాటు కంటి సమస్యలు రాకుండా ప్రజలను చైతన్య పర్చటమే లక్ష్యంగా జన చైతన్య సమితి బందం ప్రజల్లో అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాలో విస్తత స్థాయిలో నేత్రాలపై ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాయని జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు అన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రేమికుడు టీఎస్ వరప్రసాద్ మాట్లాడుతూ మరణాంతరం తమ నేత్రాలను దానం చేయడం ద్వారా నల్లగుడ్డు అంధత్వంతో బాధపడుతున్న వారికి తిరిగి మరల కంటిచూపును ప్రసాదించవచ్చన్నారు. కార్యక్రమంలో బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచి పరుచూరి పూర్ణచంద్రరావు, జన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్, బెన్నీబాబు తదితరులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

పొన్నూరు: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సంస్థ చైర్‌పర్సన్ సివిల్ జడ్జి ఎం. అంజనీ ప్రియదర్శిని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టులో నిర్వహించనున్న కార్యక్రమంలో కోర్టు పరిధిలోని కక్షిదారులు రాజీపడే క్రిమినల్, సివిల్, చెక్‌బౌన్స్, కుటుంబ వివాదాలు, బ్యాంకు కేసులు, రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.